

రాష్ట్రంలో మితిమీరిన
డ్రగ్స్ వినియోగం
● ఆఫీసుల్లో లంచం ఇవ్వనిదే పని జరగడం లేదు: మాజీ మంత్రి శ్రీరాములు ధ్వజం

ఉద్యోగం పేరుతో
రూ. 54 లక్షల మోసం
8

44,776 యూనిట్లు వృథా..!





● ఏడాదిలో రాష్ట్రవ్యాప్తంగా సేకరించిన రక్తంలో.. ప్రతి పదిమంది దాతల్లో ఒకరికి హెచ్ఐవీ
● పరీక్షల్లో హెపటైటిస్, మలేరియా తదితర జబ్బులు
● కలకలం రేపుతున్న గణాంకాలు
● అప్రమత్తంగా లేకపోతే అంతే సంగతి..!

బెంగళూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఎందరో ప్రాణాలు కాపాడాల్సిన రక్తం వృథా అవుతోంది. ప్రమాదాలకు గురైన వారిని కాపాడేందుకు రక్తం ఎంతో అవసరం. రక్తానికి ప్రత్యామ్నాయం లేకపోవడంతో దాతలపైనే ఆధారపడ్డారు. ఇందుకుగాను స్వచ్ఛంద సంస్థలు, బ్లడ్‌బ్యాంకులు, రెడ్‌క్రాస్ సొసైటీ వంటివి ఎంతో ఉదారంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఏటా రక్తం సేకరించేందుకు రక్తదాన శిబిరాలు నిర్వహిస్తుంటారు. 2024-25 సంవత్సరంలో సేకరించిన రక్తంలో హెచ్ఐవీ వైరస్, హెపటైటిస్ బీ, సీ, సిఫిలిస్, మలేరియా వంటి వ్యాధుల లక్షణాలు ఉండడంతో 44,776 యూనిట్ల రక్తం వృథా అయ్యింది. దాతలనుంచి సేకరించిన రక్తం నమూనాలను పరీక్షలు చేసిన వేళ ఇలా వేర్వేరు వ్యాధుల లక్షణాలు ఉన్నాయని రాష్ట్ర రక్తనిధి ద్వారా తెలుస్తోంది.

● రాష్ట్రంలో మొత్తం 230 బ్లడ్‌బ్యాంకులు ఉన్నాయి. ఇవి కాకుండా 43 ప్రభుత్వ బ్లడ్‌బ్యాంకులు, 66 ట్రస్టులు (చారిటబుల్ రక్తనిధి కేంద్రాలు), 108 ప్రైవేట్ ఆసుపత్రులకు అనుబంధంగా, 5 స్వతంత్ర రక్తనిధి కేంద్రాలు, 8 ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంకులు ఉన్నాయి. సాధారణంగా బ్లడ్‌బ్యాంకులు ఆసుపత్రుల సహకారంతో కళాశాలలు, ఐటీబీటీ కంపెనీలు, రాజకీయ నాయకులు, నటీనటుల పుట్టినరోజు, ఇతర కార్యక్రమాల వేళ రక్తదాన శిబిరాలు నిర్వహిస్తారు. కొన్నిచోట్ల రోడ్డుపక్కన వాహనాలు నిలిపి బ్లడ్‌క్యాంప్ నిర్వహించేవారు. అయితే శిబిరంలో దాతలనుంచి ఎలాంటి పరీక్షలు చేయకనే రక్తాన్ని దాతలనుంచి సేకరిస్తారు. శిబిరాల ద్వారా సేకరించిన రక్తాన్ని బ్లడ్‌బ్యాంకులకు తరలిస్తారు. బ్లడ్ గ్రూప్ ఇతరత్రా వివరాలను నమోదు చేయడానికి పరీక్షలు చేసే వేళ హెచ్ఐవి, హెపటైటిస్ బీ, సీ, సిఫిలిస్, మలేరియా ఇతర వ్యాధి లక్షణాల ఉన్నట్టు తేలింది. అలాంటి రక్తాన్ని డిస్‌కార్డ్ (నిష్క్రియ) చేస్తారు.

పదిమందిలో ఒకరికి..

పదిమంది దాతల్లో ఒకరికి హెచ్ఐవీ వైరస్ వెలుగుచూడడం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్ర బ్లడ్‌బ్యాంకు గణాంకాల ప్రకారం 2024-25లో 44,776 యూనిట్లు, 2023-24లో 37,906 యూనిట్లు, 2022-23లో 43,857 యూనిట్ల రక్తాన్ని పారవేశారు. 2023తో పోలిస్తే 2024లో అధికంగా నిష్క్రియం చేశారు.

రక్తం సేకరించే విధానం...

రక్తంలో ఏ, బీ, ఏబీ, ఓ పాజిటివ్, నెగటివ్ సహా మొత్తం 8 రకాల గ్రూప్‌లు ఉన్నాయి. మూడు నెలలకోసారి పురుషులు, 4 నెలలకోసారి మహిళలు రక్తదానం చేయవచ్చు. దాతలనుంచి పొందిన రక్తాన్ని సెంట్రిఫికేషన్ చేసేవేళ కింద ఎర్ర రక్త కణాలు, మధ్యలో తెల్ల రక్తకణాలు, పైన ప్లాస్మా కణాలుగా ఉంటాయి. ఇలా రక్తాన్ని సురక్షిత బ్యాగుల్లో సేకరిస్తారు. ప్లేట్‌లెక్ కణాలను 24 డిగ్రీల వాతావరణంలో, ప్లాస్మాల కణాలను మైనస్ 60 డిగ్రీ వాతావరణంలో సేకరిస్తారు. రోగికి అవసరమైన వారికి ఆ రక్తాన్ని ఇస్తారు. హిమోగ్లోబిన్ తక్కువ ఉన్న రోగులకు ప్లేట్‌లెట్‌లు ఇస్తారు. దేశంలో బాంబే బ్లడ్ గ్రూప్ చాలా అరుదైనది. రాష్ట్రంలో ఈ గ్రూప్ కల్గిన వారిసంఖ్య చాలా తక్కువగా ఉంది. అనేక బ్లడ్‌బ్యాంకులు ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకు యూనిట్లను విక్రయించలేదు. యూనిట్‌కు కనీసంగా రూ.1000, అత్యధికంగా రూ.1400- 1500మధ్య విక్రయిస్తున్నారు. కొన్ని జిల్లాల్లో బ్లడ్‌బ్యాంకులు ఇంటి ముందుకే వచ్చి వసూలు చేస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి.

ఎవరెవరు రక్తదానం చేయవచ్చు?

రక్తదానం ఎవరు చేయవచ్చు అంటే 18-65 ఏళ్ల వయసుమధ్య ఆరోగ్యకరమైన వారికి అవకాశం ఉంది. కనీస బరువు 45 కేజీల బరువు కల్గినవారు 350 ఎంఎల్, 55 కేజీలకంటే ఎక్కువ బరువు కల్గినవారు 450 ఎంఎల్ రక్తం దానం చేయవచ్చు. దాతల హిమోగ్లోబిన్ ప్రమాణం కనీసం 12.5 పాయింట్‌లు ఉండాలి.

ఎవరు చేయరాదంటే..

రక్తదానం ఎవరు చేయరాదంటే అనారోగ్యంతో ఉన్న వ్యక్తి, క్రమం తప్పక ఔషధాలు తీసుకునేవారు. సీజనల్ వ్యాధులతో బాధపడేవారు, హెచ్ఐవీ/ఎయిడ్స్ బాధితులు, క్యాన్సర్ రోగులు, హృద్రోగులు, క్షయరోగులు, హెపటైటిస్ బి, రక్తహీనత, పౌష్టికాహారం లోపంతో బాధపడేవారు, గర్భిణీలు, మధుమేహం అదుపులో లేనివారు రక్తదానం చేయరాదు. మాదకద్రవ్యాలు, కిడ్నీ సహా అవయవాల వైఫల్యంతో బాధపడేవారు, మాదకద్రవ్యాల వ్యసనాలకు లోనైనవారు, శస్త్ర చికిత్సలు చేయించుకున్నవారు, రక్తమార్పిడి చేయించుకున్నవారు రక్తదానం చేయకూడదు. ఒంటిపై ట్యాటూ (పచ్చబొట్లు) వేయించుకున్నవారు 6 నెలల పాటు రక్తదానం చేయరాదు.

కార్పొరేషన్ కమిటీల ఏర్పాటుపై సీఎం కసరత్తు

బెంగళూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): బోర్డులు, కార్పొరేషన్‌లకు అధ్యక్షులతో పాటు పాలకవర్గ కమిటీలను ఎంపిక చేసేందుకు కసరత్తు సాగింది. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ రణదీప్ సింగ్‌సూర్జేవాలా ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సుమారు రెండుగంటలకుపైగా బుధవారం రాత్రి సమీక్ష నిర్వహించారు. జిల్లాల వారీగా వివిధ బోర్డులు, కార్పొరేషన్‌లకు చైర్మన్‌లతో పాటు కమిటీ సభ్యులను నియమించే విషయమై చర్చించారు. వివిధ జిల్లాల వారీగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ముందు మంత్రివర్గ విస్తరణ, నలుగురు ఎమ్మెల్సీల నియామకం, బోర్డులు, కార్పొరేషన్‌లకు కమిటీలను ఎంపిక చేయాల్సి ఉంది. మంత్రివర్గ విస్తరణకు మరో నాలుగునెలల దాకా అధిష్టానం ససేమిరా అనడంతో సీఎం ఆ ప్రక్రియను వదిలేశారు. బోర్డులు, కార్పొరేషన్ పదవుల ద్వారా వందలాది మందికి అవకాశాలు కల్పించవచ్చునని భావించి సిద్ధమయ్యారు. సీఎం, డీసీఎం సూచించిన వారి పేర్లతో పాటు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జునఖర్గే సూచించిన వారికి పదవులను పంచిపెట్టదలచారు. అయితే జాబితాను ఎప్పుడు ప్రకటిస్తారనేది మాత్రం ఇంకా స్పష్టత రాలేదు. అయితే ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. ఎవరి పేరు ప్రకటిస్తారోనని ఎదురు చూస్తున్నారు.



జాబితాను పరిశీలిస్తున్న సీఎం, డీసీఎం, సుర్జేవాలా

కున్హా నివేదికే ఫైనల్..!

● కమిషన్ సూచనల మేరకే చర్యలు
● ఆర్‌సీబీ తొక్కిసలాటపై కేబినెట్ తీర్మానం
● హేమావతి కాలువ విస్తరణకు రూ.560 కోట్లు, హారంగికి రూ.50కోట్ల కేటాయింపునకు నిర్ణయం



బెంగళూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ టోర్నీలో ఆర్‌సీబీ జట్టు చాంపియన్‌లుగా నిలిచినందుకు జూన్4న జరిగిన విజయోత్సవాల ప్రమాదంపై మాజీ న్యాయమూర్తి జాన్ మైకేల్ కున్హా నివేదికకు అనుగుణంగా చర్యలు తీసుకునేలా కేబినెట్ తీర్మానించింది. సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన గురువారం విధానసౌధలో కేబినెట్ సమావేశం జరిగింది. మంత్రివర్గంలో 45 అంశాలకు తీర్మానించారు. వాటి వివరాలను శాసనసభా వ్యవహారాల శాఖామంత్రి హెచ్‌కే పాటిల్ మీడియాకు వివరించారు. జూన్ 4న ఆర్‌సీబీ జట్టు విజయోత్సవాల వేళ తొక్కిసలాట జరిగి 11 మంది మృతిచెందారన్నారు. ప్రభుత్వం నియమించిన మాజీ న్యాయమూర్తి జాన్‌మైకేల్ కున్హా కమిటీకు అనుగుణంగా చర్యలు తీసుకోదలచినట్లు తెలిపారు. విజయోత్సవాలను హడావిడిగా ఆర్‌సీబీతో పాటు ఈవెంట్ మేనేజ్‌మెంట్ జరుపడమే కారణంగా నివేదికలో తేల్చారన్నారు. మ్యాచ్ జరుగక ముందే ఈవెంట్ మేనేజ్ మెంట్ సూత్రప్రాయంగా సంబరాలు విషయం తెలిపినా స్పష్టత లేకుండా వ్యవహరించిందన్నారు. పైగా 4వతేదీ ఉదయమే అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారన్నారు. కనీసం స్థాయిలో కూడా పర్యవేక్షణ లేకపోవడం ఏకంగా మూడు లక్షల మంది అభిమానులు తరలిరావడంతోనే ప్రమాదం జరిగిందని ఏకంగా 11 మంది మృత్యువాత చెందారన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకునేలా తీర్మానించామన్నారు. జలవనరుల శాఖకు సంబంధించి హేమావతి కాలువ నాగమంగళ దాకా విస్తరింపచేసేందుకు రూ.560 కోట్లు మంజూరు చేశారు. హారంగి జలాశయం ఎడువ కాలువలు అభివృద్ధి చేసేందుకు రూ.49.90 కోట్లు మంజూరు చేశామన్నారు. హారంగి జలాశయంకు అనుబంధంగా కొడగు జిల్లా కుశాలనగర హులుగుంద గ్రామం వద్ద బ్రిడ్జి నిర్మాణాలకు రూ.36.50 కోట్లకు అనుమతులు ఇచ్చామన్నారు. కనకపురలో ఎంజీరోడ్ వెడల్పుకు తీర్మానించామన్నారు. బాగల్‌కోటె జిల్లా బాదామి తాలూకాలో ప్రజాసౌధ భవన నిర్మాణాలకు రూ.12.7కోట్లు మంజూరు చేశామన్నారు. కొప్పళ జిల్లాయలబుర్గ తాలూకా కార్యాలయాల అనుగుణంగా భవన నిర్మాణాలకు రూ.16 కోట్లు మంజూరు చేశామన్నారు. చిక్కమగళూరు జిల్లా నరసింహరాజ పట్టణ రోడ్ల నిర్మాణాలకు రూ. 60కోట్లకు అనుమతులు ఇచ్చామన్నారు. దక్షిణకన్నడ జిల్లా మైనార్టీ విద్యార్థుల హాస్టల్‌కు రూ.17.09 కోట్లు మంజూరు చేశామన్నారు. కోలార్ జిల్లా చింతామని తాలూకా పరిధిలోని 126 చెరువులను నింపేందుకు రూ.128 కోట్లతో ఎత్తిపోతల పథకాన్ని అమలు చేసేలా మంత్రివర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. కృష్ణా ఎగువ ప్రాజెక్టు స్టేజ్ ప్రాజెక్టుకు కేటాయించిన 130 టీఎంసీల నీటిని ఉత్తర కర్ణాటక పరిధిలోని విజయపుర, బాగల్‌కోటె, రాయచూరు, కలబురగి, యాదగిరి, కొప్పళ, గదగ జిల్లాల పరిధిలో 5.94లక్షల హెక్టార్ల సాగునీటి పరిధికి తీసుకురాదలచామన్నారు. వీటితోపాటు పలు అభివృద్ధి పనులకు కేబినెట్‌లో తీర్మానించామన్నారు.

గొర్రె కోసం వెళితే.. కాటేసిన మృత్యువు


రామమోహన్ (ఫైల్)

యల్లనూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగ్గుపల్లి గ్రామంలో గురువారం ఉదయం విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి రామమోహన్ (45) మృతి చెందినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు రామమోహన్ గురువారం ఉదయం గొర్రెల మంద వద్దకు వెళ్లాడు. ఒక గొర్రె కనిపించలేదని ఆయన తమ్ముడు నారాయణస్వామి తెలపడంతో దాన్ని వెతకడానికి వెళ్లాడు. దగ్గరలో ఉన్న గుట్టపైకి ఎక్కుతూ ప్రమాదవశాత్తు అక్కడే ఉన్న ప్రధాన విద్యుత్ తీగకు తగిలాడు. దీంతో విద్యాదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎంతసేపటికి రామమోహన్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆయనను వెతకడం ప్రారంభించారు. మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో గుట్టపై విగతజీవిగా పడి ఉన్న రామమోహన్ కనిపించడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతుడికి భార్య సులోచన, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సదరం కోసం వచ్చి మిస్సింగ్


రామకృష్ణ(ఫైల్)

అనంతపురం క్రైం, జూలై 17(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి మండలం చిన్న పొడమల గ్రామానికి చెందిన కమ్మగార్ల రామకృష్ణ కనిపించకుండా పోయాడు. దీంతో బాధితుడి తమ్ముడు రామ్మోహన్ గురువారం అనంతపురం టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు రామకృష్ణ(39)కు మాటలు రావు. ఈ నెల 16న ఉదయం సదరం సర్టిఫికెట్ పునఃపరిశీలన కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి వచ్చా డు. తిరిగి ఇంటికి వెళ్లలేదు. పలు చోట్ల గాలించినా ఆచూకీ దొరక్కపోవడంతో రామ్మోహన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. రామకృష్ణ కనిపిస్తే 9440796806 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ శ్రీకాంత్ యాదవ్ పేర్కొన్నారు.

హత్య కాదు.. గుండెపోటే..


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

బొమ్మనహాళ్, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొల్లనగుడ్డం గ్రామానికి చెందిన వన్నూరుస్వామి (45) మద్యానికి బానిసయ్యాడు. తరచూ కుటుంబ సభ్యులతో గొడవపడుతుండేవాడు. గురువారం ఉదయం మద్యం తాగి కొడుకు మోహన్‌తో గొడవపడ్డాడు. అక్కడే కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన బళ్లారి ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అతడు మరణించినట్లు తెలిపారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. వన్నూరుస్వామిని కొడుకు హత్య చేశాడంటూ ప్రచారం జరిగింది. విషయం ఆ నోటా.. ఈ నోటా.. పోలీసుల చెవిన పడింది. ఎస్ఐ నబీరసూల్, ఏఎస్ఐ హనుమంతరెడ్డి, సిబ్బంది గ్రామానికెళ్లి వన్నూరుస్వామి శవాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం కోసం బళ్లారి విమ్స్‌కు తరలించారు. పోస్టుమార్టం నివేదికలో హత్య జరగలేదని తేలినట్లు సమాచారం. గుండెపోటు అయి ఉంటుందని డాక్టర్లు చెప్పినట్లు ఎస్ఐ తెలిపారు.

దొంగలున్నారు జాగ్రత్త: ఎస్ఐ


సత్యహరిశ్చంద్రుడు


అంకన్న

తనకల్లు, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలంలో దొంగల గ్యాంగ్ తిరుగుతున్నట్లు గుర్తించామని, అప్రమత్తంగా ఉండాలని ప్రజలను ఎస్ఐ గోపీ గురువారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండలానికి చెందిన దాసరి వెంకన్న అలియాస్ చెంచు అంకన్న, అతడి అనుచరులు చెంచు సత్యహరిచంద్రుడు, ఓ మహిళ సభ్యులుగా గాల ముఠా దొంగతనాలకు పాల్పడుతోందన్నారు. వీరు తాళం వేసిన ఇళ్లలో చోరీలు, రహదారి పక్కన ఉన్న బంక్‌లను పగలకొట్టడం, సిగరెట్లు, గ్యాస్ సిలిండర్లు వంటి వస్తువులు చోరీ చేయడం లాంటివి చేస్తుంటారన్నారు. ప్రజలు ఇళ్లకు తాళం వేసి వెళ్లే ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మీ పరిసరాల్లో అనుమానస్పద వ్యక్తులను గుర్తిస్తే వెంటనే తనకల్లు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఫోన్‌నెం.934691718కు లేదా 100 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

చెన్నమ్మను మింగిన గంగమ్మ


చెన్నమ్మ(ఫైల్)

పెనుకొండ రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఓ మహిళ చెరువులో పడి మృతి చెందిన సంఘటన గురువారం వెలుగు చూసింది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు కోనాపురం గ్రామానికి చెందిన బోయ కిష్టప్ప భార్య చెన్నమ్మ(48) బుధవారం ఉదయం ఆవులను మేపేందుకు కొండాపురం సమీపంలోని ముత్యాలచెరువు సమీపానికి తీసుకెళ్లారు. సాయంత్రం 4గంటల వరకు తోటి కాపరులతో కలిసి ఆవులు మేపారు. 6గంటల సమయంలో చెన్నమ్మకు చెందిన ఆవులు ఒక్కొక్కటిగా ఇంటికి వచ్చేశాయి. అయితే ఆమె మాత్రం రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ముత్యాలచెరువు పరిసర ప్రాంతంలో గాలించారు. ఆచూకీ లభ్యంకాలేదు. గురువారం ఉదయం ముత్యాలచెరువుకు వచ్చే వంక సమీపంలో చెన్నమ్మ శవమై కనిపించడంతో గుర్తించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని చెరువులో ఉన్న చెన్నమ్మ మృతదేహాన్ని వెలికితీయించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని 108లో పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భర్త కిష్టప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి ముగ్గురు కుమార్తెలున్నారు. చెన్నమ్మ మృతిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఆ మూడు రోజులు తపాలా సేవలకు అంతరాయం

సూపరింటెండెంట్ ఆదినారాయణ

అనంతపురంవిద్య, జూలై17(ఆంధ్రజ్యోతి): సాంకేతిక కారణాలతో ఈనెల 19, 20, 21 తేదీల్లో తపాలా సేవలకు అంతరాయం వాటిల్లుతుందని పోస్టల్ సూపరింటెండెంట్ ఆదినారాయణ గురువారం ప్రకటనలో తెలిపారు. సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్నామన్నారు. ఈ కారణంగా సేవలకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు. ఈనెల 22న సేవలు పొందవచ్చని తెలిపారు.

నెట్టికంటికి గజవాహనం

సమర్పించిన బళ్లారి భక్తుడు

గుంతకల్లుటౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవాలయానికి బళ్లారికి చెందిన భక్తులు.. ఇత్తడి గజవాహనాన్ని సమర్పించారు. బళ్లారికి చెందిన హెచ్‌ఆర్‌జే రామకృష్ణ.. స్వామివారికి ఇత్తడి గజవాహనం చేయించి ఆలయ అధికారులకు గురువారం అప్పగించారు. యాగశాలలో వేదపండితులు గజవాహనానికి సంప్రోక్షణ నిర్వహించారు. అనంతరం దాతలకు ఆలయ అధికారులు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వాణి, సిబ్బంది పాల్గొన్నారు.


గజవాహనానికి పూజలు చేస్తున్న వేదపండితులు

గుంతకల్లు రైల్వే డివిజన్‌కు నిధుల వరద

బడ్జెట్‌లో కేటాయింపుల వివరాలు విడుదల

గుంతకల్లు, జూలై 17(ఆంధ్రజ్యోతి): 2025-26 కేంద్ర బడ్జెట్‌లో గుంతకల్లు రైల్వే డివిజన్‌కు కేటాయించిన నిధుల వివరాలు వెల్లడయ్యాయి. బడ్జెట్‌ను ప్రకటించిన వెంటనే జోన్లవారీగా కేటాయింపులను విడుదల చేసేవారు. కానీ ఈసారి ఆలస్యంగా వివరాలను వెల్లడించారు. గుంతకల్లు రైల్వే డివిజన్‌లో కొత్త ప్రాజెక్టుల తుది సర్వేలకు, పలు డబ్లింగ్ ప్రాజెక్టులకు, కొత్త ప్రాజెక్టులకు, ఎల్సీల తొలగింపునకు, ట్రాక్ రెన్యువల్‌కు, ట్రాక్ ప్రొటెక్షన్ ఏర్పాటుకు భారీగా నిధులను కేటాయించారు.

తుది సర్వేలకు..

- అకోలా-డోన్ మధ్య డబ్లింగ్ లైన్ (626 కి.మీ.) తుది సర్వేకు రూ.7.83 కోట్లు
- ధర్మవరం-పాకాల-కాట్పాడి డబ్లింగ్ లైన్ (290 కి.మీ.) సర్వేకు రూ.3.63 కోట్లు
- గుత్తి-పెండేకల్లు డబ్లింగ్ లైన్ (29 కి.మీ.) సర్వేకు రూ.58 లక్షలు
- పాకాల-తిరుపతి డబ్లింగ్ లైన్ (నం.42) తుది సర్వేకు రూ.84 లక్షలు
- ముద్దనూరు-పులివెందుల-ముదిగుబ్బ లైన్ (110 కి.మీ.) సర్వేకు రూ.2.75 కోట్లు
- యర్రగుంట్ల బైపాస్ లైన్ సర్వేకు రూ.11 లక్షలు
- బళ్లారి-నంచెర్ల బైపాస్ లైన్ తుది సర్వేకు రూ.42 లక్షలు
- గుంతకల్లు వెస్ట్-మల్లప్పగేట్ బైపాస్ లైన్ తుది సర్వేకు 24 లక్షలు
- గుత్తి రైల్ ఓవర్ రైల్ (ఆర్ఓఆర్) ట్రాక్ నిర్మాణం సర్వేకు రూ.40 లక్షలు
- ఓబుళవారిపల్లి-గుంతకల్లు ట్రిపుల్, ఫోర్ లైన్ల సర్వే కోసం రూ.9.68 కోట్లు



- రేణిగుంట-గూడూరు 3వ లైన్ సర్వేకు రూ.1.66 కోట్లు

లైన్ల నిర్మాణానికి..

- నంద్యాల-యర్రగుంట్ల (126 కి.మీ.) రూ.1,029.85 కోట్లు
- ఓబుళవారిపల్లె-కృష్ణపట్నం (113 కి.మీ.) రూ.465.35 కోట్లు
- కడప-బెంగళూరు (225.4 కి.మీ.) రూ.959.07 కోట్లు
- గుంతకల్లు-గుంటూరు (401.47 కి.మీ.) రూ.1,944.97 కోట్లు
- అకోలా-డోన్ డబ్లింగ్ (626 కి.మీ.) రూ.4,686.09 కోట్లు
- గుత్తి-పెండేకల్లు డబ్లింగ్ (29.225 కి.మీ.) రూ.351.83 కోట్లు
- గుంతకల్లు వెస్ట్-నంచెర్ల బైపాస్ (11.475 కి.మీ.ల) రూ.164.58 కోట్లు
- గూడూరు-రేణిగుంట 3వ లైన్ (83.17 కి.మీ.) 877.34 కోట్లు
- గుత్తి వద్ద ఫ్లై ఓవర్ లైన్ (12 కి.మీ.) 354.33 కోట్లు
- కంబం-ప్రొద్దుటూరు లైన్‌కు రూ.142 కోట్లు

ఇవి కాక..

గుంతకల్లు రైల్వే ఎలక్ట్రికల్ లోకో షెడ్ నిర్మాణానికి రూ.86 కోట్ల నిధులను కేటాయించారు. కర్నూలు కోచ్ రిహాబిటేషన్ వర్క్‌షాప్ నిర్మాణానికి రూ.540 కోట్ల కేటాయింపులు జరిగాయి. ధర్మవరం-పాకాల-తిరుపతి, వాడి-గుత్తి-రేణిగుంట సెక్షన్లలో ఎల్సీల తొలగింపునకు భారీగా నిధులు కేటాయించారు. రైల్వే డివిజన్‌లో 47.202 కి.మీ. ట్రాక్ రెన్యువల్‌కు రూ.60 కోట్లను ఇచ్చారు. సేఫ్టీ కేటగిరి కింద రైల్వే డివిజన్ వ్యాప్తంగా ట్రాక్ ఫెన్సింగ్ నిర్మాణానికి నిధులిచ్చారు.

డీపీఓపై జేసీపీఆర్ ఆగ్రహం

అనంతపురం న్యూటౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి) జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు తీరుపై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు సమస్యలపై డీపీఓను కలవడానికి జేసీ ప్రభాకర్‌రెడ్డి గురువారం డీపీఓ కార్యాలయానికి వచ్చారు. అయితే డీపీఓ జడ్పీ సమావేశంలో ఉన్నాడని తెలుసుకుని అక్కడకు వెళ్లాడు. అప్పటికే సమావేశం ముగించుకొని డీపీఓ కిందకు వచ్చారు. ఆయన్ను చూసిన జేసీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడాలని చెప్పడంతో ఇద్దరూ డీపీఆర్‌సీ భవనంలోకి వెళ్లారు. అక్కడ పలు సమస్యలపై జేసీ ప్రభాకర్‌రెడ్డి డీపీఓను నిలదీసినట్లు సమాచారం. దీంతో కలత చెందిన డీపీఓ తన వద్ద ఉన్న పేపర్లను కూడా జేసీ ప్రభాకర్‌రెడ్డి వద్దే ఉంచి బయటకు వచ్చేశాడు. దీంతో మరింత ఆగ్రహానికి లోనైన మున్సిపల్ చైర్మన్ నా ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా వెళ్లిపోతున్నాడు. ఆపండి అంటు గట్టిగా అరిచాడు. దీంతో వాహనంలో వెళుతున్న డీపీఓను జేసీ ప్రభాకర్‌రెడ్డి అనుచరులు అడ్డుకున్నారు. అయితే ప్రభాకర్‌రెడ్డితో మాట్లాడటానికి కూడా డీపీఓ ఆసక్తి చూపకపోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అనంతరం జేసీ ప్రభాకర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తాడిపత్రి మండలంలో జరిగిన అక్రమాల్లో డీపీఓకు భాగం ఉందని ఆరోపించారు. ఉన్నతాధికారుల నివేదికకు అనుగుణంగా చర్యలు తీసుకోవడానికి ఈయనకు ఏమి టి సమస్య అని ప్రశ్నించారు. ఉదయం నుంచి కాపలా కాస్తున్నాం. ఇప్పుడు వచ్చి సరైన సమాధానం ఇవ్వకుండా వెళ్లిపోవడం సమంజసమా అని ఆగ్రహం వ్యక్తం చేశాడు. తాడిపత్రి మండలంలోని 3 పంచాయతీల్లో విచ్చల విడిగా అక్రమ లేఅవుట్లు వేసినట్లు తెలిసింది. వీటిపై చర్యలు తీసుకోవాలని జేసీ ప్రభాకర్‌రెడ్డి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అలాగే అహుడా నివేదికకు అనుగుణంగా చర్యలు చేపట్టడంలో డీపీఓ నాగరాజునాయుడు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం, పలుమార్లు ఫోన్‌లో సరైన సమాధానం ఇవ్వకపోవడంతో డీపీఓను కలవడానికి స్వయంగా జేసీ ప్రభాకర్‌రెడ్డి వచ్చారు. అలాగే డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-5 బదిలీల్లో ఎమ్మెల్యే సిఫార్సు చేసిన వాటికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదని చెబుతున్నారు.

గుజిరీలో ట్రాన్స్‌కో సామగ్రి

విజిలెన్స్ అధికారుల దాడులు

4 టన్నుల వైరు, పరికరాల సీజ్


సీజ్‌చేసిన విద్యుత్ తీగలు, పరికరాలు

తాడిపత్రి, జూలై17(ఆంధ్రజ్యోతి): ఓ గుజిరీ షాపులో ఏకంగా 4 టన్నుల విద్యుత్ తీగలు, పరికరాలు పట్టుబడడం కలకలం రేపింది. పట్టణంలోని అశోక్ పిల్లర్ సమీపాన గల గుజిరీ షాపులో గురువారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు, పోలీసులు దాడులు చేశారు. రూ.6 లక్షల విలువైన సామగ్రి పట్టుబడింది. అధికారులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ట్రాన్స్‌కో కార్యాలయానికి సంబంధించిన విద్యుత్ వైరు, పలురకాల పరికరాలు పట్టణంలోని ఒక గుజిరీ షాపులో ఉన్నట్లు అధికారులకు సమాచారం అందింది. హుటాహుటిన ట్రాన్స్‌కో అధికారులు.. పోలీసులతో కలిసి దాడులు చేశారు. విద్యుత్‌తీగలు, పరికరాలను పెద్దఎత్తున స్వాధీనం చేసుకుని, స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. దాడుల్లో ఏడీఏ ప్రభాకర్ రావు, విజిలెన్స్ అధికారులు నాగభూషణం, ఏఈ రాజారావు పాల్గొన్నారు.

గుజిరీలో నిల్వపై అనుమానాలు

గుజిరీ దుకాణంలో పెద్దఎత్తున విద్యుత్‌వైరు, పరికరాలు ఉండడంపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. కార్యాలయంలో పనిచేసే వారే.. ఈ అక్రమానికి పాల్పడి ఉంటారా అన్న కోణంలో విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారని తెలుస్తోంది. విద్యుత్ సామగ్రి కార్యాలయం నుంచి తరలించినా.. సంబంధిత అధికారులు ఫిర్యాదు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

నామినేటెడ్ సంబరం

ఆరు మార్కెట్ యార్డు కమిటీలకు చైర్మెన్ల నియామకం


అనసూయ


సూర్యప్రతాప్


రామకృష్ణప్ప


శైలజ


చంద్రకళ


శివప్రసాద్

పుట్టపర్తి/అనంతపురం రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో నలుగురు టీడీపీ, ఇద్దరు జనసేన నాయకులకు నామినేటెడ్ పదవులు దక్కాయి. మార్కెట్ యార్డు కమిటీలకు వీరిని చైర్మన్‌లుగా ప్రభుత్వం నియమించింది. గుత్తి మార్కెట్ యార్డు చైర్మన్‌గా సూర్యప్రతాప్(టీడీపీ), పెనుకొండకు బొక్సంపల్లి రామకృష్ణ చౌదరి(టీడీపీ), గోరంట్ల యార్డుకు సోమందేపల్లికి చెందిన నడిమిపల్లి ఈ. శైలజ వెంకటేష్(టీడీపీ), తనకల్లు యార్డుకు తులిసేనాయక్ తండాకు చెందిన బుక్కే చంద్రకళ (టీడీపీ), కదిరికి ఎన్‌పీ కుంట మండలం తిమ్మమ్మమర్రిమానుకు చెందిన ఎం.అనసూయ(జనసేన), పుట్టపర్తి మార్కెట్ యార్డుకు జనసేన కొత్తచెరువు మండల కన్వీనర్ పూల శివప్రసాద్‌ను నియమించారు. టీడీపీ, జనసేనలో పార్టీ విధేయులకు పట్టం కట్టారు. కూటమి పార్టీల్లో జనసేనకు సముచిత ప్రాధాన్యం ఇచ్చారు.

మోసం కేసులో బిల్ కలెక్టర్ అరెస్టు

అనంతపురం క్రైం, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఓ యువతిని మోసగించిన ఘటనలో బిల్ కలెక్టర్ శివప్రసాద్‌ను దిశ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. దిశ డీఎస్పీ మహబూబ్‌బాషా తెలిపిన మేరకు బిల్ కలెక్టర్ ఇదివరకే వివాహమై ఇద్దరు పిల్లలున్నారు. అయితే తన బంధువైన ఓ యువతితో గత మూడేళ్లుగా సన్నిహితంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆమెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇటీవల ఆమె పెళ్లి ప్రస్తావన తేవడంతో తిరస్కరించాడు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించారు. ఆమె ఫిర్యాదు మేరకు దిశ పోలీసులు కేసు నమోదు చేసి, బిల్ కలెక్టర్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు.

గుర్తుతెలియని శవం లభ్యం

అమరాపురం, జూలై17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం పరిధిలోని చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం తేలింది. ఎస్ఐ ఇషాక్ బాషా తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చెరువులో శవం తేలియాడుతుండడాన్ని అటుగా వెళ్లిన వారు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఇషాక్ బాషా ఘటనాస్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మృతుడి వయసు 45 ఏళ్లు ఉండవచ్చనీ, ఏడెనిమిది రోజుల క్రితం మృతిచెంది ఉండవచ్చన్నారు. శవం పూర్తిగా కుళ్లిపోవడంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలూ లభించలేదు. అతడి సంబంధికులు 9441825793 నంబరులో సంప్రదించాలన్నారు.

పలు ప్రాంతాల్లో చిరుజల్లులు

అనంతపురం అర్బన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం చిరు జల్లులు పడ్డాయి. అనంతపురం, బొమ్మనహాళ్, యాడికి, పెద్దవడుగూరు, ఉరవకొండ, గుత్తి తదితర ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి. మిగిలిన ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమైనా వర్షం పడలేదు. దీంతో ఆయా ప్రాంతాల్లో రైతులు తీవ్ర నిరాశకు లోనయ్యారు.

పగలే చోరీలు

మడకశిర టౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పగలే దొంగలు చోరీలకు తెగబడ్డారు. పావగడ రోడ్డులో గురువారం రెండు ఇళ్లలో చోరీ చేశారు. కొలిమి నాగేంద్ర ఇంటితోపాటు పక్కనే ఉన్న మరో ఇంటి మేడపై ఉన్న శకుంతల ఇంట్లో దొంగలు పడ్డారు. కొలిమి నాగేంద్ర ఉదయం 11 గంటలకు బ్యాంకు పని నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసుకుని, వెళ్లాడు. దీనిని అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళం ధ్వంసం చేసి, లోపలికి చొరబడ్డారు. బీరువా తాళాలు పగులకొట్టి అందులోని రూ.70 వేలు నగదు, జత బంగారు కమ్మలు, ఉంగరం అపహరించారు. నాగేంద్ర ఇంటికిరాగా.. తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికెళ్లి చూడగా.. బీరువా తాళాలు పగులకొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. జత బంగారు కమ్మలు, ఒక ఉంగరం చోరీ అయినట్లు బాధితులు తెలిపారు. సమీపంలోనే మేడపై ఉంటున్న శకుంతల పెనుకొండ కియ ఫ్యాక్టరీలో పనికెళ్తుంది. ఆమె ఫ్యాక్టరీకి వెళ్లగా దొంగలు ఇంటి తాళాలు పగులకొట్టి లోపలికి చొరబడ్డారు. బీరువాలోని బంగారు నగలు అపహరించారు. సమాచారం అందుకున్న సీఐ నాగేష్ బాబు.. సిబ్బందితో అక్కడికి చేరుకుని, రెండు ఇళ్లలో పరిశీలించారు. క్లూస్ టీమ్‌తో వేలిముద్రలు సేకరించారు. పగలే, అది కూడా ప్రధాన రహదారి పక్కనే ఉనన ఇళ్లలో చోరీలు జరగడంతో పట్టణంలో కలకలం రేగింది. చోరీలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బాలిక అదృశ్యం


నల్లక్క

బెళుగుప్ప, జూలై17(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన బాలిక నల్లక్క కనిపించకుండా పోయింది. ఎస్ఐ శివ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నల్లక్క పదో తరగతి వరకు చదువుకుంది. ఇంటి వద్దే ఉంటుండేది. ఈ నేపథ్యంలో బుధవారం ఇంటి నుంచి బయటికెళ్లిన నల్లక్క తిరిగిరాలేదు. కుటుంబీకులు.. బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించారు. బాలిక తల్లి ఓబుళమ్మ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు విచారిస్తున్నట్లు ఎస్ఐ శివ తెలిపారు.

అనంత క్రికెటర్ల హవా

ఆంధ్రా అండర్-23 జట్టు ప్రాబబుల్స్‌లో ఆరుగురికి చోటు


అర్జున్ టెండూల్కర్


మల్లికార్జున


కమిల్


దీపక్


మహేంద్రరెడ్డి


దత్తారెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై17(ఆంధ్రజ్యోతి): అనంత క్రికెటర్లు అదరగొడుతున్నారు. ఆంధ్రా అండర్-23 క్రికెట్ జట్టులో ఏకంగా ఆరుగురు జిల్లా క్రికెటర్లు చోటు దక్కించుకున్నారు. అర్జున్ టెండూల్కర్, మల్లికార్జున, కమిల్, దీపక్, మహేంద్రరెడ్డి, దత్తారెడ్డి ఎంపికైన వారిలో ఉన్నారు. శుక్రవారం నుంచి విజయనగరంలో నిర్వహించే వన్డే మ్యాచ్‌లకు వీరు ప్రాతినిధ్యం వహించనున్నారు. జట్టు కోచ్‌గా జిల్లాకే చెందిన నరేష్ ఎంపికయ్యాడు.

పేదలకు సీఎంఆర్‌ఎఫ్ అండ: ఎంపీ అంబికా

రూ.10.06 లక్షల చెక్కుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం క్రైం, జూలై 17(ఆంధ్రజ్యోతి): వైద్యం కోసం లక్షలు వెచ్చింది, ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్న వారికి సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎంపీ గురువారం పంపిణీ చేశారు. వనజ, జయమ్మ, మహమ్మద్ గౌస్, తలారి మణికంఠ, శ్రీరామ్‌రెడ్డి, మమతకు రూ.10.06 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఎంపీ అంబికా మాట్లాడుతూ... జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించినపుడు ప్రజల సమస్యలను విని, సీఎం సహాయనిధి ద్వారా సాయం చేస్తానని హామీ ఇచ్చానన్నారు. దానిని నెరవేర్చడం ఆనందంగా ఉందన్నారు.

యువతికి వేధింపులు.. కేసు నమోదు

ధర్మవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ కాలనీకి చెందిన ఓ యువతిని వేధించిన యువకుడిపై కేసు నమోదు చేశామని టూటౌన్ సీఐ రెడ్డప్ప గురువారం తెలిపారు. సీఐ తెలిపిన మేరకు, బాధిత యువతి బీటెక్ పూర్తి చేసి, జావా కోర్సు చేసేందుకు నాలుగు నెలల క్రితం హైదరాబాద్‌కు వెళ్లింది. అక్కడ హాస్టల్‌లో ఉంటూ కోర్సు చేస్తోంది. రెండు నెలల క్రితం స్నేహితురాలి పుట్టిన రోజు వేడుకల్లో ఆమెకు ధర్మవరం మండలం తుంపర్తికి చెందిన ప్రణవ్‌తో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి ఇద్దరూ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. ఈ క్రమంలో కోచింగ్‌కు వెళ్లే సమయంలో ప్రణవ్ వెంటపడుతూ అసభ్యకరంగా ప్రవర్తించడం ప్రారంభించాడు. తన కోరిక తీర్చాలని వేధించేవాడు. ఇష్టం లేదని చెప్పినా వినుకోలేదు. ఈ క్రమంలో వారం క్రితం బాధిత యువతి ధర్మవరానికి వచ్చింది. అయినా ప్రణవ్ బెదిరించడం మానుకోలేదు. ఫోన్ చేసి, ఫొటోలను అసభ్యంగా తయారు చేసి బంధుమిత్రులకు పంపుతానని బాధితురాలిని బెదిరించాడు. మాట వినకపోతే చంపుతానని హెచ్చరించాడు. ఈ విషయాన్ని బాధిత యువతి తన తల్లిదండ్రులకు చెప్పి, టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

జూనియర్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతి

అనంతపురం న్యూటౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఆర్‌అండ్‌బీ సర్కిల్ పరిధిలోని పలువురు జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఎస్‌ఈ మహేశ్వరరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్‌హెచ్ సర్కిల్ అనంతపురంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉన్న రాజశేఖర్‌రెడ్డికి ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఆర్‌అండ్‌బీ ఎన్‌హెచ్ అనంతపురం డివిజన్‌కు, ఆర్‌అండ్‌బీ అనంతపురం సర్కిల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గ్ ఉన్న ఎస్తేర్‌రాణిని కళ్యాణదుర్గానికి, నంద్యాల డివిజన్‌లో టైపిస్టుగా పనిచేస్తున్న మదన్‌కుమార్‌ను కర్నూలుకు, కోయిలకుంట్ల నుంచి కిరణ్‌కుమార్‌ను రాయదుర్గం సబ్‌డివిజన్‌కు బదిలీ చేశారు.

20న బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా జూనియర్ బాలబాలికల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు ఈనెల 20వ తేదీన స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు శ్రీకాంత్‌రెడ్డి, నరేంద్రచౌదరి గురువారం ప్రకటనలో తెలిపారు. 2007 జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన క్రీడాకారులు అర్హులన్నారు. ఎంపికైన జట్లు ఆగస్టు 14వ తేదీ నుంచి తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు. ఆసక్తి, అర్హత గల వారు జనన ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, యూనిఫాం, క్రీడాసామగ్రితో సెలెక్షన్స్‌కు హాజరుకావాలన్నారు. వివరాలకు 9393711324 నంబరులో సంప్రదించాలని కోరారు.

మీకు అండగా నేనుంటా..!

బోయ నరసింహులు కుటుంబానికి మంత్రి లోకేశ్ భరోసా



కామిరెడ్డిపల్లి బోయ నరసింహులు కుటుంబసభ్యులతో నారా లోకేశ్

ధర్మవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఫ్యాక్షన్ బారిన పడి నష్టపోయిన బోయ నరసింహులు కుటుంబాన్ని విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఉండవల్లిలోని తన నివాసానికి గురువారం పిలిపించుకుని మాట్లాడారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ధర్మవరం నియోజకవర్గంలోని కామిరెడ్డిపల్లికి చెందిన దాసరి నరసింహులు టీడీపీలో మొదటి నుంచి క్రియాశీలకంగా ఉండేవారు. దీంతో ప్రత్యర్థులు 2011లో దారికాచి, ద్విచక్రవాహనంపై వెళుతున్న బోయ నరసింహులు, ఆయన కుమారుడు, కూతురును దారుణంగా హత్య చేశారు. ఈ హత్యలు ఉమ్మడి రాష్ట్రంలో సంచలనం రేపాయి. ఫ్యాక్షన్ బారిన పడి బోయ నరసింహులు కుటుంబం ఎంతగానో నష్టపోయింది. అప్పట్లోనే టీడీపీ అధినేత చంద్రబాబు ఆ కుటుంబానికి అండగా నిలిచారు. తాజాగా వారి బాగోగులను మంత్రి నారా లోకేశ్ స్వయంగా తెలుసుకున్నారు. ఆనాటి ఫ్యాక్షన్ హత్యల ఘటన నుంచి రెండు నెలల బాలుడు మృత్యుంజయుడిగా బయటపడ్డాడు. ఆ బాలుడిని మంత్రి నారా లోకేశ్ ఆప్యాయంగా పలకరించారు. బాగా చదువుకుని, ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. తమ యోగక్షేమాలు తెలుసుకున్న మంత్రి లోకేశ్‌కు నరసింహులు కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

జయేంద్ర సరస్వతి స్వామిజీ (జయంతి)




కంచికామకోటి పీఠాధిపతిగా పేరొందిన జగద్గురు జయేంద్ర సరస్వతి స్వామిజీ 1935 జూలై 18న తంజావూరు జిల్లా ఇరుల్ నీకిలో న్మించారు. బాల్య నామం సుబ్రహ్మణ్య అయ్యర్. నడిచే దేవుడిగా పేరున్న కంచి పరమాచార్య చంద్ర శేఖరేంద్ర సరస్వతి స్వామిజీ ఆయనను ఎంపిక చేశారు. 1954 నుంచి జయేంద్ర సరస్వతిగా పిలవబడుతున్నారు. హిందూధర్మ ప్రచారానికి ఎనలేని కృషి చేశారు. వివిధ ప్రాంతాలలో చాతుర్మాస్య దీక్షలు నిర్వహించి పీఠం ప్రాశస్త్యాన్ని ఇనుమడింప చేశారు. పలు పాఠశాలలు, ఆసుపత్రులు నిర్మించి మానవసేవయే మాధవసేవ అని చాటి చెప్పారు. 2018 ఫిబ్రవరి 28న పరమపదించారు.

నెల్సన్ మండేలా (జయంతి)



'నోబెల్ శాంతి పురస్కార' గ్రహీత నెల్సన్ మండేలా 1918 జూలై 18న జన్మించారు. దక్షిణాఫ్రికాకు చెందిన జాతివివక్ష వ్యతిరేక ఉద్యమకారుడు, ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ అధ్యక్షుడు. ఉద్యమంలో తలెత్తిన మారణకాండకు 27ఏళ్లపాటు జైలుశిక్ష అనుభవించారు. 'నల్లజాతి సూరీడు'గా అభివర్ణించబడ్డారు. జైలు నుంచి విడుదలయ్యాక దేశంలో నెలకొన్న జాతివైర్యాన్ని నివారించడానికి ఎంతో కృషి చేశారు. పూర్తిస్థాయి ప్రజాస్వామ్య పద్ధతిన ఎన్నికై 1994 నుంచి 1999వరకు దక్షిణాఫ్రికా అధ్యక్షుడిగా వ్యవహరించారు. శాంతికోసం పాటుపడిన ఆయనకు ఎన్నో పురస్కారాలు దక్కాయి. 2013 డిసెంబరు 5న కన్నుమూశారు.

మెహిది హాసన్ (జయంతి)



'గజల్ చక్రవర్తి'గా పేరొందిన మెహిది హాసన్ 1927 జూలై 18న లూనాలో జన్మించారు. రాజస్థాన్‌లో సంప్రదాయ ధృపద్ సంగీతకారుల కుటుంబానికి చెందినవారు. గజల్ గాయనంలో రాణించారు. రేడియో పాకిస్థాన్‌లో తుమ్రి గాయకుడిగా కెరీర్‌ను ప్రారంభించిన ఆయన 50వేలకుపైగా గజల్స్ ఆలపించారు. దేశ విదేశాలలో ప్రదర్శనలు ఇచ్చారు. జలంధర్‌లో సైగల్ అవార్డు, నేపాల్‌లో గోర్ఖా దక్షిణ బహు అవార్డు, ఇతర పురస్కారాలు పొందారు. 2012 జూన్ 13న కన్నుమూశారు. 2018లో 91వ జయంతికి గూగుల్‌డూడుల్ ఏర్పాటు చేసింది.

రాజేశ్‌ఖన్నా (వర్ధంతి)



రాజేశ్‌ఖన్నా 1942 డిసెంబరు 29న అమృత్‌సర్‌లో జన్మించారు. అసలుపేరు జతిన్ ఖన్నా. ఇండియన్ సినిమాలో తొలి సూపర్ స్టార్ ఆయనే. 1969 నుంచి 1971 వరకు వరుసగా 15 సోలో సినిమాలతో రికార్డు సృష్టించారు. అప్పట్లో ఆయన అత్యధిక పారితోషికం అందుకున్న నటులలో ఒకరు. 'ఆఖ్రి ఖాత్' సినిమా 1967లో ఆస్కార్‌కు నామినేట్ అయ్యింది. 168కుపైగా ఫీచర్ ఫిల్మ్స్, 12 షార్ట్ ఫిల్మ్స్ తీశారు. ఉత్తమనటుడిగా 3 ఫిల్మ్‌ఫేర్, 4 బీజేఎఫ్ఏ అవార్డులు, ఇతర పురస్కారాలు అందుకున్నారు. ఢిల్లీ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపీగా వ్యవహరించారు. 2012 జూలై 18న కన్నుమూశారు. మరణానంతరం 'పద్మభూషణ్' అవార్డు ప్రకటించారు.

విన్ డీజిల్ (పుట్టినరోజు)



విన్ డీజిల్ 1967 జూలై 18న జన్మించారు. అసలు పేరు మార్క్ సింక్లైర్, అమెరికాకు చెందిన నటుడు, నిర్మాత. 'డొమినిక్ టొరెట్టో' సినిమాతో పేరొందారు. 'వన్ రేస్ ఫిల్మ్స్' ప్రొడక్షన్ కంపెనీ స్థాపించారు. అవేకనింగ్స్, మల్టీఫేషియల్, ఫాస్ట్ ఫైవ్, బ్లడ్‌షాట్ వంటి అవతార్ తదితర సినిమాలను రూపొందించారు. బుల్లితెర పైనా, వీడియోగేమ్స్‌లోనూ సత్తా చాటుకుని పలు అవార్డులు పొందారు.

ప్రియాంక చోప్రా (పుట్టినరోజు)



'పద్మశ్రీ' పురస్కార గ్రహీత ప్రియాంక చోప్రా జోనస్ 1982 జూలై 18న బీహార్ రాష్ట్రం జంషెడ్‌పూర్ (ప్రస్తుతం జార్ఖండ్ రాష్ట్రం)లో జన్మించారు. నటి, నిర్మాత, గాయని, మోడల్‌గా రాణిస్తున్నారు. అత్యధిక పారితోషికం అందుకుంటున్న నటీమణులలో ఒకరు. ఎమిస్ వరల్డ్ 2000 అందుకున్నారు. 2008లో హిందీలో ఫ్యాషన్ సినిమాకు నేషనల్ ఫిల్మ్ అవార్డ్ ఫర్ బెస్ట్ యాక్ట్రెస్ అందుకున్నారు. ఇలా రెండు నేషనల్ అవార్డులు, 5 ఫిల్మ్‌ఫేర్, ఇతర అవార్డులు పొందారు. ఫౌండేషన్ ద్వారా విద్య, వైద్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2022లో బిబిసి 100 ఉమెన్ జాబితాలో చోటు దక్కించుకున్నారు.

స్మృతి మందాన (పుట్టినరోజు)



అర్జున అవార్డు గ్రహీత మహిళా క్రికెటర్ స్మృతి మందాన 1996 జూలై 18న ముంబైలో జన్మించారు. 16వ యేటనే 2013లో క్రికెట్‌లో జాతీయస్థాయిలో రాణించారు. 2014లో ఇంగ్లండ్‌పై టెస్ట్ పోటీల్లో పాల్గొన్నారు. 2018లో బీసీసీఐ నుంచి బెస్ట్ ఉమెన్స్ ఇంటర్నేషనల్ క్రికెటర్‌గా, 2022 జనవరిలో ఐసీసీ ఉమెన్స్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అందుకున్నారు. 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్‌గేమ్స్‌లో క్రికెట్ టోర్నమెంట్‌కు వైస్‌కెప్టెన్‌గా వ్యవహరించారు. వన్డేలు, టెస్ట్ మ్యాచ్‌లు, టి-20 క్రికెట్‌లలోనూ మ్యాచ్‌లలో డొమెస్టిక్‌లోనూ, అంతర్జాతీయ కెరీర్‌లోనూ సత్తా చాటుకున్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి

పెనుకొండ, జూలై 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సేవాగుణం అలవర్చుకుని సమాజసేవలో తమవంతు తోడ్పాటును అందించాలని ఎన్‌ఎస్‌ఎస్‌పీఓ జయప్ప సూచించారు. గురువారం స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో శ్రమదానం చేపట్టారు. కళాశాల ప్రాంగణంలో పిచ్చిమొక్కలు తొలగించి నీరు పోశారు.

నమ్మ మెట్రోలో స్మార్ట్ సేవలు

● 70 శాతం విభాగాల్లో ఆధునీకీకరణ ● ఆన్‌లైన్ టిక్కెట్లతో ప్రయాణికులకు తగ్గిన కష్టాలు



బెంగళూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మెట్రో ప్రయాణికులకోసం ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ సదుపాయం కల్పించడంలో బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (బీఎంఆర్‌సీఎల్) రోజురోజుకూ కొత్త మైలురాళ్లు సాధిస్తోంది. అందులో భాగంగా 9కిపైగా యాప్‌లలో టిక్కెట్ లభించే సౌలభ్యం కల్పిస్తోంది. ఇలా ఆన్‌లైన్ టిక్కెట్, స్మార్ట్‌కార్డ్‌ల ద్వారా ప్రయాణించే వారి సంఖ్య 70శాతానికి పైగా ఉందని బీఎంఆర్‌సీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం మహేశ్వర్ రావు తెలిపారు. 2023 నుంచి ఓపెన్ నెట్‌వర్క్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) నెట్‌వర్క్‌లో ఆటో, ట్యాక్సీ సేవలు ఉండేవి. వీటికి మెట్రో టిక్కెట్‌లను కూడా చేర్చడం ద్వారా ప్రయాణీకులకు మరింత వెసలుబాటు కల్పించినట్టయ్యింది. ఆన్‌లైన్ టికెట్ ఉపయోగించేవారు ఒకే యాప్ ద్వారా తమ ఇంటినుంచి గమ్యస్థానం చేరేందుకు వీలుకానుంది. తద్వారా సమయం, శ్రమ పొదుపు కానుంది. నమ్మ మెట్రో మొబైల్ యాప్, థర్డ్‌పార్టీ యాప్‌ల ద్వారా మెట్రో టిక్కెట్‌లు కొనుగోలు కల్పించారు. నమ్మయాత్రి, పేటీఎం, టమ్మాక్, ర్యాపిడో, రెడ్‌బస్, వాట్సప్ చాట్‌బోట్, ఈజ్ మై ట్రిప్, హైవే డిలైట్, మైల్స్ అండ్ కిలోమీటర్స్ (వయా టెలిగ్రామ్) వంటి యాప్‌ల ద్వారా మెట్రో టిక్కెట్ పొందవచ్చు.

ఎన్‌రూట్ చాలెంజ్

రానున్న రోజుల్లో ప్రజలకు రవాణా వ్యవస్థ డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం ప్రజలకు మరింత చేరువ కానుంది. ఇప్పటికే మెర్సిడెస్ బెంజ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఇండియా (బీఎంఆర్‌డీఐ), డబ్ల్యు ఆర్ఐ ఇండియా అండ్ విల్‌గ్రో సహకారంతో 'ఎన్‌రూట్ ఛాలెంజ్' విధానం అమలు చేశారు. తద్వారా మెట్రో, బస్, చివరి స్టేజ్ చేరుకునేలా వీలు కల్పించారు. బీఎంటీసీ, బీఎంఆర్‌సీఎల్ ఇందుకు సహకారం అందించడంతో కొండంత బలం చేరింది.

డిజిటల్ ఆవిష్కరణల ప్రారంభపు రోజుల్లో కొన్ని సవాళ్లు ఉండేవి. వాటికి శాశ్వత పరిష్కారానికి ఎన్నో చర్యలు చేపట్టారు. ఓలా, ఉబెర్ ప్రారంభంపు రోజుల్లో ట్యాక్సీ సంఘాలు నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఇవన్నీ ట్యాక్సీ డ్రైవర్లకు అదనపు ఆదాయం తెచ్చే వనరుల్లా మారాయి. అదే రీతిన వాట్సాప్ చాట్ ద్వారా టికెట్ పొందే వ్యవస్థను బీఎంఆర్‌సీఎల్ తొలుత జారీ చేసింది. కొన్ని నెలలక్రితం ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్ పొందే ప్రక్రియలో తలెత్తిన సాంకేతిక సమస్యలపై ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు రావడంతో వాటిని క్రమేపీ పరిష్కరించగలిగింది. ఇలా ప్రస్తుతం 9 రకాల యాప్‌ల ద్వారా టిక్కెట్‌లు పొందే వెసలుబాటు లభించినట్లయింది.



స్టేషన్‌లో ఏర్పాటు చేసిన వాట్సాప్ స్కానర్



పేటీఎంలో మెట్రో రీచార్జ్ వెసలుబాటు

నారాయణ భరమనికి డీసీపీగా ఉద్యోగోన్నతి

సీఎం కొట్టే ప్రయత్నం చేశారంటూ వీఆర్‌ఎస్‌కు ప్రయత్నించిన అధికారి



బెంగళూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఏసీపీ హోదాలో కొనసాగుతున్న నారాయణ భరమనికి అనూహ్యంగా ఉద్యోగోన్నతి లభించింది. బెళగావి డివిజన్‌కు లా అండ్ ఆర్డర్ డీసీపీగా నియమిస్తూ గురువారం ఆదేశాలు జారీ చేశారు. కేంద్రప్రభుత్వం నిత్యావసర ధరలు పెంచారని బెళగావిలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ద్వారా నిరసన చేసిన సందర్భంలో ప్రత్యేక బందోబస్తు నిమిత్తం నారాయణభరమని వెళ్ళారు. నిరసన వేళ బీజేపీ కార్యకర్తలు సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో ఆయన సహనం కోల్పోయిన విషయం తెలిసిందే. ఎవరక్కడ పోలీసు అధికారులంటూ సీఎం ఆవేశంగా మాట్లాడిన సందర్భంలో వివరణ ఇచ్చేందుకు వెళ్ళిన ఏసీపీ అధికారి నారాయణ భరమనిపై సీఎం చేయి ఎత్తి కొట్టే ప్రయత్నం చేశారు. దీంతో బహిరంగంగా అవమానం జరిగిందని అధికారి వీఆర్‌ఎస్ ద్వారా పదవీ విరమణకు దరఖాస్తు చేసుకున్నారు. సీఎం సిద్దరామయ్య, హోంమంత్రి పరమేశ్వర్‌లు స్వయంగా ఫోన్ చేసి అనుకోకుండా జరిగిందని నాకు కొట్టే ఉద్దేశం లేదని రిటైర్డ్‌మెంట్ లాంటి నిర్ణయాలు వద్దని సముదాయించారు. అందుకు అధికారి కూడా దరఖాస్తు చేశానని ఉన్నతాధికారులదే తుది నిర్ణయమని సమాధానం ఇచ్చారు. అధికారి వీఆర్‌ఎస్ దరఖాస్తును ఉన్నతాధికారులు పరిగణలోకి తీసుకోలేదు. తాజాగా ఏసీపీ హోదాలో ఉన్న నారాయణభరమనిను డీసీపీగా పదోన్నతి కల్పించడంతో పాటు సంఘటన జరిగిన బెళగావి డివిజన్‌కు పోస్టింగ్ ఇచ్చారు. నారాయణ భరమని మంచి క్రమశిక్షణ కలిగిన అధికారిగా పనిచేసిన ప్రతిచోటా పేరొందారు.

రద్దీకి అనుగుణంగా 16 ప్రత్యేక రైళ్లు



హైదరాబాద్, జులై 17(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల డిమాండ్ మేరకు వేర్వేరు ప్రాంతాల నుంచి 16 ప్రత్యేక వీక్లీ రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసినట్టు దక్షిణమధ్య రైల్వే అధికారులు తెలిపారు. ఆగస్టు 3 నుంచి 24వ తేదీ వరకు(ఆది) తిరుపతి-చర్లపల్లి(07481) 4 రైళ్లు, ఆగస్టు 4 నుంచి 25వ తేదీ వరకు(సోమ) చర్లపల్లి-తిరుపతి (07482) 4 రైళ్లు, ఈ నెల 25 నుంచి ఆగస్టు 15వ తేదీ వరకు (శుక్ర) ఎర్నాకుళం-పాట్నా(06085) 4 రైళ్లు, ఈ నెల 28 నుంచి ఆగస్టు 18వ తేదీ వరకు(సోమ) పాట్నా-ఎర్నాకుళం (06086) మధ్య 4 రైళ్లు నడుస్తాయని పేర్కొన్నారు.

ఇక ఇంటి నుంచే పోస్టల్ సేవలు

హిందూపురం, జూలై 17(ఆంధ్రజ్యోతి): అడ్వాన్స్ పోస్టల్ టెక్నాలజీ 2.0తో అనేక సేవలను తపాలాశాఖ ద్వారా ఇంటి నుంచే అందజేస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇంట్లో నుంచి సెల్‌ఫోన్‌లో తపాలాసేవలు పొందవచ్చన్నారు. ఈనెల 22నుంచి హిందూపురం పోస్టల్ డివిజన్ పరిధిలోని 472పోస్టాఫీసుల్లో అమలవుతుందన్నారు.

నెల్యాడి సమీపాన విరిగిన మట్టిచరియలు

● మంగళూరు-బెంగళూరు మధ్య రాకపోకలకు బ్రేక్ ● వాహనదారులకు ఇబ్బందులు

బెంగళూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): మంగళూరు-బెంగళూరు మధ్యన జాతీయ ప్రధానరహదారిపై మట్టి చరియలు విరిగిపడటంతో రాకపోకలకు బ్రేక్ పడింది. దక్షిణకన్నడ జిల్లా నెల్యాడి సమీపాన రోడ్డు పక్కనే ఉండే మట్టిచరియలు విరిగి పడ్డాయి. దీంతో రవాణాను పూర్తిగా నిలిపివేశారు. నాలుగు లైన్‌ల రహదారి నిర్మాణాలకు అత్యంత ఎత్తైన గుట్టను ముందస్తు రక్షణా చర్యలు చేపట్టకుండానే తొలగించారు. ఈప్రాంతంలో రెండునెలలకు పైగా నిరంతరంగా వర్షాలు వస్తుండటంతో మట్టిచరియలు ఒక్కసారిగా విరిగిపడ్డాయి. ఈ మార్గంలో వాహనాలు రాకుండా పదికిలోమీటర్‌ల దూరం నుంచే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. రోడ్డు దాటే పరిస్థితి లేకుండా పోవడంతో వేలాది మంది ప్రయాణీకులు ఇబ్బంది పడ్డారు.



విరిగిపడిన మట్టిచరియలు



సభాస్థలి వద్ద చేసిన ఏర్పాట్లు

సీఎం సభకు భారీ ఏర్పాట్లు

పావగడ, జూలై 17(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఈనెల 21న పావగడకు వస్తున్న నేపథ్యంలో సభకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. మహాత్మాగాంధీ స్టేడియంలో సభ జరగనుంది. జిల్లా కలెక్టర్ శుభకల్యాణి, ఐజీ రఘురాం, ఎస్పీ అశోక్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైద్య సేవలపై అవగాహన కల్పించండి: కలెక్టర్

రాయచూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఓపెక్ ఆస్పత్రిలో లభిస్తున్న సూపర్ స్పెషాలిటీ స్థాయి మెరుగైన వైద్య సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా అధికారి కే నితీశ్ సూచించారు. గురువారం ఓపెక్ ఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ నిర్మాణంలో ఉన్న ట్రామా కేర్ సెంటర్‌ను పరిశీలించిన జిల్లాధికారి పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. దీంతో పాటు హృద్రోగ విభాగాన్ని పరిశీలించిన జిల్లాధికారి అక్కడ రోగులకు అందుతున్న సేవలు వైద్యులు పని చేస్తున్న తీరు తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో సమావేశమైన డీసీ, వైద్యసేవలు మెరుగు పడిన నేపథ్యంలో ఇక్కడ ఓపెక్ ఆస్పత్రిలో జరుగుతున్న వైద్యసేవల పై ప్రజలకు అవగాహన కలిగేలా ప్రచారం చేపట్టాలన్నారు. అదే సమయంలో ప్రైవేటు వైద్యులు ప్రభుత్వ వైద్యులు మెరుగైన వైద్య చికిత్సను ఓపెక్ ఆస్పత్రిలో అందిస్తున్నట్లు రోగులకు వివరించాలన్నారు. నిబంధనల మేరకు ఎలాంటి అనుమని లేకుండా వైద్యసేవలందిస్తున్న జిల్లాలోని 14 క్లినిక్‌లకు జిల్లాధికారి కే నితీశ్ నోటీసులు జారీ చేశారు. నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్ లేకుండా వైద్య పరీక్షలు నిర్వహించడం, ఎక్స్ రేలు తీయడం ఇతర వైవ్య సేవలందించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీ నితీశ్

ఆర్మీ ర్యాలీ పారదర్శకంగా చేపట్టాలి

వచ్చే నెల 4వ తేదీ నుంచి 22వ తేదీ వరకు స్థానిక వ్యవసాయ విశ్వవిద్యాలయంలో చేపట్టనున్న సైన్యం ఎంపికల ర్యాలీలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అధికారి నితీశ్ సూచించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను సమర్థంగా నిర్వహించుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆగస్టు 4 నుంచి 22 వరకు చే పట్టే సైన్యం ఎంపికల ప్రక్రియకు సంబంధించి గురువారం నూతన జిల్లాధికారి కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా అధికారి దాదాపు 15 రోజులకు పైగా సాగే ఎంపిక ప్రక్రియల్లో ఎలాంటి లోటుపాటులకు తావు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తు ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు.

స్వచ్ఛ నగరాల జాబితాలో మైసూరుకు మూడో స్థానం

బెంగళూరు, జూలై17 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా స్వచ్ఛనగరాల జాబితాలో రాచనగరి మైసూరుకు మరోసారి మూడోస్థానం దక్కింది. మైసూరు నగరం కొన్నేళ్లుగా స్వచ్ఛనగరంగా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతూనే ఉంది. 3-10లక్షల జనాభా కేటగిరిలో మైసూరు నగరానికి మూడో స్థానం దక్కింది. ఇదే కేటగిరిలో మధ్యప్రదేశ్ నగరం ఇండోర్ నగరానికి ప్రథమ స్థానం దక్కింది. విషయం ప్రకటించగానే పౌరకార్మికులు మైసూరు నగరపాలికె సంస్థ ముందు సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు పంచుకుని సంతోషం వ్యక్తం చేశారు. మైసూరులో ప్రసిద్ధి చెందిన నాడదేవత చాముండేశ్వరీదేవ జయంతి రోజునే స్వచ్ఛనగరిగా పేరొచ్చిందని పౌరకార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి మంజునాథ్ తెలిపారు.



స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకుంటున్న పౌరకార్మికులు



మీడియాతో మాట్లాడుతున్న జస్టిస్ గోపాలగౌడ

అత్యాచారాలపై విచారణకు సిట్ ఏర్పాటు చేయాలి

● హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ గోపాలగౌడ

బెంగళూరు, జూలై17(ఆంధ్రజ్యోతి): ధర్మస్థళ ప్రాంతంలో అత్యాచారాలు జరిగాయనే ఆరోపణలకు సంబంధించి ప్రత్యేక సిట్ ఏర్పాటు చేసి దర్యాప్తు జరిపించాలని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోపాలగౌడ డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ప్రజాసంఘాల నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ మెజిస్ట్రేట్ ముందు సాక్ష్యం చెప్పిన తర్వాత దర్యాప్తు సక్రమంగా జరగడం లేదన్నారు. పోలీసులు సాక్ష్యం చెప్పేందుకు వచ్చిన ఫిర్యాదుదారుడిపైనే ఒత్తిడి తెస్తున్నారన్నారు. అతడు పోలీసులకు చెప్పిన అంశాలు బయటకు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. ఫిర్యాదు చేసిన వ్యక్తి న్యాయవాదితో కలిసి కళేబరాలను వెలికి తీస్తానంటూ చెబుతున్నా పోలీసులు ఎందుకు అక్కడికి వెళ్లడం లేదన్నారు. వెంటనే దర్యాప్తును సుప్రీం లేదా హైకోర్టు మాజీ న్యాయమూర్తులతో సిట్ ఏర్పాటు చేయాలన్నారు. ఫిర్యాదు దారుడితో పాటు న్యాయవాదికి బెదిరించే ధోరణి సరికాదన్నారు. న్యాయవాది సీఎస్ ద్వారకనాథ్ మాట్లాడుతూ ఫిర్యాదు దారుడి వివరాలను సాక్ష్యంగా తీసుకోవాల్సి ఉంటుందని ప్రైవేటు వ్యక్తులకు సమాచారం లీక్ చేయడం సరికాదన్నారు ఇప్పటికే హోంమంత్రికి ఫిర్యాదుదారుడి తరుపు న్యాయవాది లేఖ రాశారన్నారు.

నిరంతర అభ్యాసంతోనే విజయం

● విద్యావేత్త డాక్టర్ నాగరాజయ్య



జ్ఞాపికలతో విద్యార్థులు

విజయపుర, జూలై 17 (ఆంధ్రజ్యోతి): చదువులో రాణించాలంటే నిరంతర అభ్యాసంతో సాధన సాధ్యమని, దీర్ఘకాలంగా పాటించడం ద్వారా జీవితంలో మెరుగైన ఫలితాలు ఉంటాయని విద్యానిపుణులు, బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాధికార విద్యావిభాగం డాక్టర్ ఆర్ నాగరాజయ్య అభిప్రాయపడ్డారు. పట్టణంలోని గిరిజాశంకర కల్యాణమండపంలో ప్రగతి హైస్కూల్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటైన ప్రతిభా పురస్కారాల ప్రదానం, తల్లిదండ్రులతో చర్చాగోష్టిలో పాల్గొని మాట్లాడారు. చదవడానికి, నేర్చుకోవడానికి ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. చదివినది నేర్చుకోమని, నేర్చుకున్నది జీవితాంతం మరవమని ఉదాహరణకు ఈత వంటివి ప్రస్తావించారు. విద్యతోపాటు వినయం, సంస్కృతి సంప్రదాయాలు నేర్చుకోవాలని సూచించారు. పరీక్షలకోసం నిరంతరం శ్రమించాల్సి ఉంటుందని హితవుపలికారు. 2025 ఎస్ఎస్ఎల్‌సీలో ఉత్తమ మార్కులు సాధించిన వారికి జ్ఞాపికలు అందచేసి అభినందించారు.

ఘనంగా చాముండేశ్వరీదేవి జయంతి



పురవీధుల్లో ఊరేగుతున్న అమ్మవారు

విజయపుర, జూలై 17(ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలో నగరేశ్వరస్వామి సేవాట్రస్టు ఆధ్వర్యంలో చాముండేశ్వరి జయంతి వేడుకలు నిర్వహించారు. జయశంకర్ కుటుంబీకులు ఇతర భక్తులు సహకారం అందించారు. 13వ వార్షిక చాముండేశ్వరి ఉత్సవాలు గురువారం ఉత్సాహంగా సాగాయి. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవమూర్తిని పురవీధులలో ఊరేగించారు. ఉత్సవంలో ట్రస్టు అధ్యక్షులు పునీత్‌కుమార్, అజిత్, ప్రవీణ్, మహంతి మఠం కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు.

కేంద్రమంత్రి కుమారస్వామికి సుప్రీంలో ఊరట



బెంగళూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): బిడది సమీపంలోని కేతగానహళ్ళిలో ప్రభుత్వ భూమిని ఫారం హౌస్‌లోకి కలుపుకున్నారనే ఆరోపణపై కేంద్ర మంత్రి కుమారస్వామికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. కర్ణాటక హైకోర్టు ధర్మాసనం విచారణ జరిపేలా ఇచ్చిన ఆదేశాలపై కుమారస్వామి సుప్రీం కోర్టును ఆశ్రయించారు. గురువారం న్యాయమూర్తులు పంకజ్‌మిత్తల్, ప్రసన్న బి వరాళెల ధర్మాసనం తదుపరి ఆదేశాలు జారీ చేసేదాకా వివాదానికి స్టే విధించింది. సమాజ పరివర్త సముదాయ సంస్థకు నోటీసులు జారీ చేసింది. లోకాయుక్త విచారణలు ముగిసిన మేరకు న్యాయ ఉల్లంఘన విచారణలను చేపట్టేలా హైకోర్టు ఆదేశించింది. వీటన్నింటికీ తాత్కాలికంగా బ్రేక్ పెట్టేలా సుప్రీం కోర్టు స్టే విధించింది.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1,611.07
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	38,779	49.522
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	38,523	212
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	39.72

రాష్ట్రంలో మితిమీరిన డ్రగ్స్ వినియోగం

● ఆఫీసుల్లో లంచం ఇవ్వనిదే పని జరగడం లేదు ● రాష్ట్రంపై సుర్జేవాలా పెత్తనం ఏమిటో..? ● మాజీ మంత్రి శ్రీరాములు

బళ్లారి, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డ్రగ్స్ వాడకం పెరిగిపోయింది, చాలా కళాశాలల్లో విద్యార్థులకు డ్రగ్స్ అందుబాటులో ఉన్నాయి, అయినా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని మాజీ మంత్రి శ్రీరాములు మండిపడ్డారు. గురువారం నగంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డ్రగ్స్ అమ్మకాలలో కాంగ్రెస్ పార్టీలో ఉండే మల్లికార్జున ఖర్గే తనయుడు ప్రయాంకా ఖర్గే కు సన్నిహితుడు ఒకరు ఇటీవల పోలీసులకు దొరికారాన్నరు. రాష్ట్రంలో డ్రగ్స్, గుట్కా, మట్కా, పేకాట, విచ్చల విడిగా జరుగుతున్నాయిని ఆరోపించారు. కళాశాల వద్ద, బహిరంగంగా గంజాయి దొరుకుతుంటే పోలీసులు ఏమి చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహరాల ఇన్‌చార్జి సుర్జేవాల కర్నాటక ఎమ్మెల్యేలు, మంత్రులతో సమావేశం జరిపి, ఒక నియంతగా వ్యవహరిస్తున్నారు. అసలు ఆయన ఉద్దేశం ఏమిటి..? అని ప్రశ్నించారు. ప్రజల సమస్యలు పట్టించుకోకుండా సిద్దరామయ్య కోమాలో ఉన్నారని విమర్శించారు. బెంగళూరులో జరిగిన ఓబీసీ జాతీయ కమిటీ సమావేశంలో బీహార్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జరిపారన్నారు. బళ్లారి సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రిలో వైద్యుల కొరత ఉందని, ఇక్కడ వైద్యులు నియామకం జరపాలని కోరారు.

గాలి జనార్దన్‌రెడ్డితో మనస్పర్థలు లేవు

జనార్దన్‌రెడ్డితో దూరంగా ఉన్నారు కదా, కలిసే అవకాశం ఉందా అని ప్రశ్నించగా గాలితో తనకు ఎలాంటి మనస్పర్థలు లేవని మంత్రి శ్రీరాములు అన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరాములు

ఒక వేళ ఉన్నా ఆయన్ని, తనను కూర్చొబెట్టి అరగ్లాసు వేడి నీరు ఇచ్చి అవితాగే సమయం అంటే కేవలం ఒక నిమిషంలోనే అన్ని సమస్యలు ముగిసిపోతాయన్నారు. ఇద్దరమూ బీజేపీలో ఉన్నామని గుర్తుచేశారు. గాలి కుమారుడు కిరీటి రెడ్డి హీరోగా నటించిన సినిమా చూస్తారా అని అడగ్గా.. తప్పకుండా చూస్తానన్నారు. కిరీటిరెడ్డి తన చేతుల్లో పెరిగాడని బదులిచ్చారు. ఆయనతో పాటు కార్పొరేటర్ ఇబ్రహీంబాబు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

హోస్పేట, జూలై 17(ఆంధ్రజ్యోతి): సమగ్ర గని పర్యావరణ పునరుజ్జీవన ప్రాజెక్టు కింద హోస్పేట తాలూకాల్లోని 58 గని ప్రభావిత గ్రామాల్లో ఉద్యానవన కార్యకలాపాలను ప్రారంభించడానికి ఆసక్తి గల రైతుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ పీజీ చిదానందప్ప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యక్తి గత నీటి సేకరణ యూనిట్లు, ఉల్లిపాయల పెంపకం యూనిట్లు, ఫామ్‌గేట్ ప్యాక్ హౌస్‌లు, డ్రాగన్ ఫ్రూట్, దానిమ్మ, మామిడి, కొబ్బరి, నిమ్మకాయల విస్తీర్ణ విస్తరణ ఉద్యానవన వెంచర్‌లు వంటి ఉద్యానవన కార్యకలాపాలను ప్రారంభించాలనుకునే రైతులు హోస్పేట ఉద్యానవన శాఖ కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకుని దరఖాస్తులను సమర్పించాలన్నారు. వివారలకు ఉద్యానవన శాఖ అధికారులు రైతు కాంటాక్ట్ సెంటర్ అసిస్టెంట్ హార్టికల్చర్ ఆఫీసర్ హోస్పేట సెల్: 9164297220, మరియమ్మనహళ్లి సెల్:7204888978, కమలాపుర సెల్: 8123465548, హోస్పేట ఉద్యానవన సహాయ డైరెక్టర్ సెల్:9901555690, సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ సెల్: 8310291867 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరుతో

రూ.54 లక్షల మోసం

బళ్లారి గాంధీనగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి బళ్లారి నగరానికి చెందిన ఓ వ్యక్తి నుంచి ఏకంగా రూ.54లక్షలు మోసం చేసిన ఘటన వెలుగు చూసింది. బాధిత వ్యక్తి నగరంలోని సైబర్ పోలీసు స్టేషన్(సీఎస్ఎన్)లో బుధవారం ఫిర్యాదు చేశాడు. బాధితుడు పోలీసులకు తెలిపిన వివరాల మేరకు మోసానికి గురైన వ్యక్తి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. గత 2023 సంవత్సరంలో హైదరాబాద్‌లో మాదాపుర ప్రాంతంలో ఉన్న విప్రో కంపెనీల్లో ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకు వెళ్ళాడు. అయితే అక్కడ ఉద్యోగం దొరకలేదు. అనంతరం మొబైల్ ఫోన్ ద్వారా పరిచమైన చందనా, రజత్ అను వ్యక్తులు విప్రోలో సీనియర్ మేనేజర్ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికి ఒక ఏడాది కాలంలో 90సార్లు పైగా దశల వారీగా రూ.54.15లక్షలు కాజేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అఖరికి మోసపోయానిని తెలుసుకున్న తరువాత నగరంలోని సీఈఎన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సైబర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని వంచనకు పాల్పడిన బ్యాంకు అకౌంట్‌కు సంబంధించిన సమాచారంతో పాటు నిందితులను పట్టుకునేందుకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు మంత్రాలయ పీఠాధిపతి రాక



సుబుదేంద్రతీర్థస్వామి

బళ్లారి సిటీ, జూలై 17(ఆంధ్రజ్యోతి): మంత్రాలయ రాఘవేంద్ర స్వామి పీఠాదిపతి సుబుదేంద్ర తీర్థ శ్రీపాదంగల స్వామి శుక్రవారం బళ్లారిలో పర్యటించనున్నారు. చాతుర్మాస్య సందర్భంగా ప్రజల కల్యాణం కోసం ఉదయం 8గంటలకు నగరంలోని సత్యనారాయణపేట రాఘవేంద్రస్వామి మఠంలో సుదర్శన హోమం నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు తప్తముద్రణ నిర్వహిస్తారు. కార్యక్రమం సత్యనారాయణపేట 1వ క్రాస్ రోడ్డులో ఉన్న జగద్గురు శ్రీ మన్మధ్వాచార్యుల మూల మహాసంస్థానం అయిన నంజనగూడ్ రాఘవేంద్ర స్వామి మఠంలో జరుగుతుందని మఠ నిర్వాకులు తెలిపారు.

విద్యా ప్రమాణాలు పెంచాలి

● పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాలి : ఏఐడీఎస్ఓ



విద్యాశాఖ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న ఏఐడీఎస్ఓ సభ్యులు

బళ్లారి సిటీ, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యా నాణ్యతను మెరుగుపరచడానికి తగిన చర్యలు తీసుకోవాలని గురువారం విద్యాశాఖ అధికారి శ్రీమతి లక్ష్మీద్వారా ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు ఏఐడీఎస్ఓ బళ్లారి కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఏఐడీఎస్ఓ జిల్లాధ్యక్షుడు ఈరన్న మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యా నాణ్యత ఏడాదికేడాదికి క్షీణిస్తోందని, ఇది తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యను ఇష్టపడే రాష్ట్ర ప్రజల్లో ఆందోళనకు కారణమవుతోందన్నారు. నాణ్యత క్షీణతకు అనేక అంశాలు కారణమవుతున్నాయి. నాణ్యమైన బోధన, అభ్యాసానికి అనుకూలమైన వాతావరణం, శాస్త్రీయ మూల్యాంకన వ్యవస్థ అనే ఈ మూడు అంశాలు విద్య నాణ్యతలో కీలక పాత్ర పోషిస్తాయని ఏఐడీఎస్ఓ విజ్ఞప్తి చేసింది. తప్పనిసరి ఉత్తీర్ణత విధానాన్ని వదిలివేసి 1వ తరగతి నుండే పాస్ ఫెయిల్ అమలు చేయాలన్నారు. ప్రభుత్వ , ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 70వేలకుపైగా పోస్టులను శాశ్వతప్రాతిపదికన నియమించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు తగిన సౌకర్యాలు కల్పించాలని, వాటిలో అన్ని సౌకర్యాలతో కూడిన భవనాలు, మరుగుదొడ్లు, తాగునీరు ఏర్పాటు చేయాలని కోరారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి కంబలి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ హుండీ లెక్కింపు



హుండీ సొమ్మును చూపుతున్న అధికారులు

బళ్లారిరూరల్, జూలై17(ఆంధ్రజ్యోతి): నగరంలో కనకదుర్గమ్మ ఆలయ హుండీ సొమ్మును గురువారం లెక్కించారు. ఏసీ ప్రమోద్, ధార్మిక దత్త అధికారి ఈఓ హనుమంతప్ప నేతృత్వంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. 13 హుండీలకు గాను రూ. రూ.67,86,179 నగదు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. దేవస్థానం ఆవరణంలో సీసీ కెమెరా పుటేజీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అధికారుల నేతృత్వంలో రాత్రి సమయం వరకు నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధికారులు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

రాయచూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): రేషన్ బియాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న లారీని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా సరిహద్దు సింధనూరు వద్ద గురువారంపోత్నాళ్ పట్టణానికి చెందిన గురురాజ్ అనే వ్యక్తి బళ్ళారి జిల్లా నుంచి పెద్ద ఎత్తున రేషన్ బియ్యాన్ని గుజరాత్ రాష్ట్రానికి తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న ప్రజా సంఘాల నాయకులు జిల్లాలోని శ్రీపురం జంక్షన్ వద్ద లారీని అడ్డుకుని నిలిపివేశారు. విషయాన్ని హెల్ప్‌లైన్ ద్వార పోలీసులకు చేరవేయగా అక్కడికి వచ్చిన పోలీసులు లారీని అదుపులోకి తీసుకున్నారు. అక్కడికి వచ్చిన ఆహార శాఖ అధికారి బియ్యాన్ని పరిశీలించి అవి రేషన్ దుకాణాలకు వెళ్లాల్సినవేనని ధ్రువీకరించిన అనంతరం అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సింధనూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

న్యూ శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత పయ్యావుల రాధాకృష్ణ కన్నుమూత

● నేడు బళ్లారిలో అంత్యక్రియలు



రాధాకృష్ణ (ఫైల్)

బళ్లారి, జూలై 17(ఆంధ్రజ్యోతి): బళ్లారిలో ప్రముఖ విద్యాసంస్థ న్యూ శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత పయ్యావుల రాధాకృష్ణ(65) కన్నుమూశారు. ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధితో రెండు నెలలుగా హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న ఆయన గురువారం తుదిశ్వాస వదిలినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాధాకృష్ణ స్వస్థలం అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం. ఎంకాం పీహెచ్‌డీ చేసిన ఆయన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కామర్స్ లెక్చరర్‌గా పనిచేశారు. పనిచేస్తూనే శ్రీ చైతన్య కళాశాలలను ప్రారంభించారు. అనంతరం 10 బ్రాంచిలు ఏర్పాటు చేసి విజయవంతంగా నడిపారు. ఎంతో మంది ఫీజులు కట్టుకోలేని పేద విద్యార్థులకు ఉచితంగా చదువు చెప్పించిన విద్యాధాతగా ఆయనకు పేరుంది. రాధాకృష్ణకు భార్య పయ్యావుల రాధిక, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరు యూఎస్ఏలో స్థిరపడ్డారు. ఆయన కన్నుమూసే సమయంలో కుటుంబీకులు అందరూ పక్కనే ఉన్నారు. శుక్రవారం సాయంత్రం బళ్లారిలోని హరిశ్చంద్ర ఘాట్‌లో అంతిమ సంస్కారం నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రాధాకృష్ణ మృతికి ప్రముఖుల సంతాపం

పయ్యావుల రాధాకృష్ణ మృతికి బళ్లారి జిల్లా కమ్మసంఘం అధ్యక్షుడు, ప్రముఖ పారిశ్రామిక వేత ముండ్లూరు అనూఫ్ కుమార్, కమ్మసంఘం కమిటీ సభ్యులు, బెస్ట్ స్కూల్ కళాశాల యజమాని కోనంకి రామప్ప. మేయర్ నందీష్‌బాబు, ప్రముఖ వ్యాపార వేత, బొమ్మనహాళ్ మండలం కొత్తపల్లి తిమ్మరాజులు, కొత్తపల్లి మల్లికార్జు. మహేంద్ర, పయ్యవుల బాబు, వషిష్ట కళాశాల, నలంద, శ్రీ చైతన్య, పీపుల్స్ ట్రీ. ఎంజీఎం, నంద, నందీఇంటర్నేషన్, జ్ఞానామృత, నారాయణ, తదితర విద్యాసంస్థల యజమానులు, న్యూ శ్రీ చైతన్య కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు సంతాపం వ్యక్తం చేశారు. రాధాకృష్ణ మరణం విద్యాసంస్థలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు సంతాపం వ్యక్తం చేశారు.

బాల్యవివాహాలు, పోక్సోచట్టంపై

అవగాహన కల్పించాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ,జూలై 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాల్య వివాహాల నిషేధం, పోక్సోచట్టం గురించి విద్యార్థుల్లో మరింత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా అన్నారు. గురువారం నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయ హాల్లో మహిళా ,శిశు అభివృద్ధి శాఖకు చెందిన వివిధ ప్రాజెక్టుల జిల్లాస్థాయి సమన్వయ కమిటీ ప్రగతి సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. బాల్యవివాహాల నిషేదం, పోక్సో చట్టం గురించి అవగాహన కల్పించడానికి పోలీసు శాఖ గ్రామ సభల్లో. విద్యాశాఖ ప్రీ-యూనివర్శిటీ కళాశాలలు,ఉన్నత పాఠశాలలలో పనిచేయాలని ఆయన అన్నారు. సాంఘిక సంక్షేమం వెనుకబడిన తరగతుల సంక్షేమం, మైనారిటీ సంక్షేమం ఇతర శాఖల హాస్టళ్లలోని పిల్లల కోసం బాల్య వివాహాలు పోక్సో చట్టంపై కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో బేటీ బచావ్-బేటీ పడావ్ పథకాన్ని మరింత ప్రభావవంతంగా అమలు చేయాలంటే, లింగ నిష్పత్తి తక్కువగా ఉన్నా తాలూకాలు గ్రామ పంచాయతీల్లో అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. జిల్లాలో 6సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో పెరుగుదల మందగించడం,బరువు నియంత్రణ,పోషకాహార లోపం రక్తహీనతను నివారించడానికి మహిళా శిశు అభివృద్ధి శాఖ పోషణ అభియాన్ ప్రాజెక్టును కలిగి ఉందన్నారు. లబ్ధిదారులను గుర్తించి వారి ఆధార్ సీడింగ్ సమాచారాన్ని పోషణ్ ట్రాకర్ వ్యవస్థలో సరిగ్గా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళలు, పిల్లలపై హింస, మహిళలు పిల్లల అక్రమ రవాణా , గృహ హింస బాల్య వివాహాలు వంటి వివిధ కేసులను త్వరగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సఖి వన్‌స్టాప్‌సెంటర్, బాలికల హాస్టల్, అణగారిన మహిళలు, లింగమార్పిడిదారులు సహా వివిధ ప్రాజెక్టుల పురోగతిని సమావేశం సమీక్షించారు. ఈసందర్భంగా నగర డీఎస్పీ చంద్రకాంత్ నందారెడ్డి, మహిళా శిశు అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామకృష్ణ, జిల్లా బాలల రక్షణ అధికారి నాగప్ప, అన్ని తాలూకాల బాలల అభివృద్ధి ప్రాజెక్టు అధికారులు, అధికారులు, అధిపతులు పాల్గొన్నారు.

అంతర్గత ఫిర్యాదుల కమిటీ తప్పనిసరి

విజయనగరం జిల్లా కలెక్టర్ ఎంఎస్ దివాకర్ బాబు



బళ్లారి సిటీ,జూలై 17(ఆంధ్రజ్యోతి): మహిళలపై లైంగిక వేధింపుల నివారణ, నిషేదం, పరిష్కార చట్టం 2013 ప్రకారం ప్రభుత్వ , ప్రైవేట్ కార్యాలయాల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు తప్పనిసరి అని విజయనగరం జిల్లా కలెక్టర్ ఎంఎస్ దివాకర్ బాబు ఆదేశించారు. గురువారం తన కార్యాలయ హాల్లో జరిగిన అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు సమావేశానికి అధ్యక్షత వహించి ఆయన మాట్లాడారు. వ్యవస్థీకృత, అసంఘటిత, ప్రైవేట్ ప్రభుత్వ రంగాల్లో 10 మంది కంటే ఎక్కువ మహిళలు , పురుషులు పనిచేస్తుంటే అటువంటి సంస్థలు, కార్యాలయాల అధిపతులు అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఒక వర్కింగ్ ఉమెన్ చైర్‌పర్సన్‌గా ఇద్దరు సభ్యులతో ఓ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి 3సంవత్సరాలకు ఓసారి ఆ కమిటీని పునర్నిర్మించాలన్నారు. కార్యాలయాల్లో లైంగిక వేధింపులు నిషేధించబడ్డాయని పేర్కొంటూ యజమానులు నోటీసు లేదా సర్క్యులర్ జారీ చేయాలని, అంతర్గత ఫిర్యాదు కమిటీ సభ్యుల చిరునామా, స్థానం, సమయం గురించి సమాచారం అందించాలన్నారు. ఫిర్యాదుదారుడి విచారణ సమయంలో అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అలా చేయడంలో విఫలమైతే రూ.50వేలు వరకు జరిమానా విధించబడుతుంది, అలాంటి చర్యలు పునరావృతమైతే, ప్రతి విధి ఉల్లంఘనకు జరిమానా రెట్టింపు అవుతుందని హెచ్చరించారు. ఈసందర్భంగా ఏడీసీ బాలకృష్ణప్ప, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం తగదు: లోకాయుక్త సీఐ సురేష్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న లోకాయుక్త అధికారులు

సిరుగుప్ప, జూలై17 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, తక్షణ పరిష్కారం చేపట్టాలని లోకాయుక్త సీఐ సురేష్ అధికారులకు సూచించారు. గురువారం సిరుగుప్ప పట్టణం శిశు అభివృద్ధి యోజన కార్యాలయంలో లోకాయుక్త సీఐ సురేష్, తాలుకా ప్రజల నుంచి సమస్యలపై ఫిర్యాదులు, దరఖాస్తులు స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలను అధికారులతో విన్నవించుకున్నారు. రెవెన్యూ, నగర సభ విద్యాశాఖకు సంబంధించి ఫిర్యాదులను అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ సురేష్ మాట్లాడుతూ రోజురోజుకు ప్రజలసమస్యలు పెరుగుతున్నాయని, అధికారులు ఈ విషయాలపై దృష్టిసారించాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గౌసియా బేగమ్, జెడ్పీ కార్యనిర్వహణాధికారి తిప్పేస్వామి, పీడబ్ల్యూడీ ఏఈఈ చెన్ననగౌడ, వివిధ ప్రభుత్వ శాఖాధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

కౌన్సిలర్ల సహకారంతోనే అభివృద్ధి

● పురసభ కమిషనర్ గంగాధర



మాట్లాడుతున్న పురసభ కమిషనర్ గంగాధర

సిరుగుప్ప, జూలై 17(ఆంధ్రజ్యోతి): నగరసభ కౌన్సిలర్లు సహకారంతో నగర అభివృద్ధికి కృషి చేస్తానని పురసభ కమిషనర్ గంగాధర తెలిపారు. గురువారం సిరుగుప్ప పట్టణం పురసభ కార్యాలయంలో అధ్యక్షురాలు రేణుకమ్మ ఆధ్వర్యంలో సామాన్యసభ జరిగింది. ఈ సమావేశంలో నగర సభ కమిషనర్ మాట్లాడుతూ నగరపరిధిలో పరిశుభ్రత, రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక సదుపాయాలు తాగునీటి విషయంపై ప్రతి ఒక్కరి సహకారం తప్పనిసరి అన్నారు. నగరసభ కౌన్సిలర్లు, సిబ్బంది ప్రతి ఒక్కరూ అభివృద్ధికి సహకరించాలన్నారు. అనంతరం పట్టణంలో నగర సభ పరిధిలో రానున్న సమస్యలపై అధికారులు, కౌన్సిలర్లు సుదీర్ఘంగా చర్చించారు. కౌన్సిలర్లు తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలపై వార్డుల్లో సుదీర్ఘచర్చలు చేపట్టారు. ఈ సందర్భంగా నగరసభ ఉపాధ్యక్షురాలు యశోద, ఏఈఈ గంగాధరగౌడ, ఇంజనీర్లు, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

గుత్తి, జూలై 17(ఆంధ్రజ్యోతి): స్థానిక కర్నూల్ రోడ్డును దాటుతున్న లక్ష్మీదేవి (65)ని బుధవారం రాత్రి ద్విచక్రవాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆమె అనంతపురం ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక ఆమె గురువారం మరణించినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

హోసూరు జోన్

జోరుగా వరినాట్లు



కృష్ణగిరి సమీపంలో వరినాట్లు వేస్తున్న రైతులు

హోసూరు (కృష్ణగిరి), జూలై 17(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సరం ఆశాజనకంగా వర్షాలు కురిశాయి. అందుకు అనుగుణంగా ప్రాజెక్టులు, చెరువులు జలకళను సంతరించుకున్నాయి. దీంతో ఇప్పటికే దుక్కులు చేసిన రైతులు నాలుగైదు రోజులుగా వరినాట్లు చేపట్టారు. సాధారణంగా ఆషాఢమాసంలో వరినాట్లు చేపడతారు. ఈసారి కూడా సకాలంలో వర్షాలు కురవడంతో వరినాట్లు వేస్తున్నామని పలువురు రైతులు తెలిపారు. దీంతో పొలాల్లో రైతు కూలీలు బిజీగా ఉంటున్నారు. కృష్ణగిరి, అవధానపట్టి, సుండేకుప్పం, తిమ్మాపురం, కుమ్మనూరు వంటి ప్రాంతాలలో నారుమళ్లను ఎంచుకుని వరినాట్లు వేయడంలో నిమగ్నమయ్యారు. మహిళలు పాటలు పాడుతూ ఉత్సాహంగా నాట్లు వేయడం గమనార్హం.



తిమ్మాపురంలో..

కెలవరపల్లి డ్యాం నుంచి నీటి విడుదల



స్విచ్ ఆన్ చేస్తున్న కలెక్టర్ దినేశ్ కుమార్, ఎమ్మెల్యే ప్రకాశ్

హోసూరు రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): హోసూరు తాలూకా కెలవరపల్లి డ్యాంలోని కుడి, ఎడమ ప్రధాన కాలువలు, చిన్న కాలువల ద్వారా సాగు కోసం గురువారం నీటిని విడుదల చేశారు. కలెక్టర్ దినేశ్‌కుమార్, హోసూరు ఎమ్మెల్యే ప్రకాశ్ స్విచ్ ఆన్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్యాంనుంచి కాలువల ద్వారా 8వేల ఎకరాలలో సాగుకు వీలు కానుందన్నారు. కుడి కాలువ ద్వారా 5918 ఎకరాలు, ఎడమ కాలువ ద్వారా 2082 ఎకరాలకు నీరు అందుతుందన్నారు. హోసూరు, శూలగిరి తాలూకాలలోని 22 గ్రామాలకు ప్రయోజనం దక్కుతుందన్నారు. తట్టకనపల్లి, మోరనపల్లి, తోరపల్లి, ముతాలి, తిరుచిపల్లి, చన్నత్తూరు, అట్టూరు, దిన్నూరు, నల్లకనకొత్తపల్లి, శుభగిరి, మార్తాండపల్లి తదితర గ్రామాల రైతులకు ప్రయోజనం దక్కుతుందన్నారు. నీటిని వృథా చేయరాదన్నారు. ఆనకట్ట సామర్థ్యం 44.28 అడుగులు కాగా ప్రస్తుతం 40.67 అడుగులకు నీరు ఉందన్నారు. కార్యక్రమంలో జలవనరులు, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

హోసూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా నచికుప్పం పంచాయతీ యనియన్ మిడిల్ స్కూల్‌లో కామరాజ్ జయంతిని అర్థవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమ్మైగల్ చారిటబుల్ ట్రస్టు విద్యార్థినీ విద్యార్థులకు నోటు పుస్తకాలు అందచేసింది. చక్కగా చదివి ప్రయోజకులు కావాలని ట్రస్టు నిర్వాహకులు పిలుపునిచ్చారు.



నోటు పుస్తకాలతో విద్యార్థులు